క్లుప్తంగా

నేడు పాఠశాల వార్షికోత్సవం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో రవీంద్రభారతి విద్యాసంస్థలు రవీంద్ర దర్పణ్ పేరిట వార్షికోత్సవంను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రవీంద్రభారతి పాఠశాల మాదాపూర్ బ్రాంచ్ విద్యార్థులు ఆటపాటలతో అలరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి నేషనల్ హ్యాండీ క్రాఫ్ట్ ఫెయిర్ ప్రారంభం



వివరాలను వెల్లడిస్తున్న జనరల్ మేనేజర్ అంజయ్య తదితరులు

మాదాపూర్: భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సంయుక్త నిర్వహణలో నేటి నుంచి (బుధవారం) శిల్పారామంలో నేషనల్ హ్యాండీ క్రాఫ్ట్ ఫెయిర్ ప్రారంభమవుతుందని శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య తెలిపారు. మంగళవారం ఫెయిర్‌కి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో హ్యాండీ క్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ సయ్యద్ ముబారక్ అలీ, శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్యలు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఫెయిర్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కళాకారులు తయారు చేసిన హస్తకళలు, చెక్కబొమ్మలు, ఆర్టిఫీ'ఇయల్ జువెలరీ, టెర్రకోట, వెదురు ఫర్నిచర్, తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దాదాపు 550 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్కిల్ డీఈ విశాలాక్షి

రాయదుర్గం: అంతర్గత రోడ్లు సీసీరోడ్లుగా మారుతున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ పనులను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ విశాలాక్షి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పరిశీలించారు.

పాజిటివ్ నిల్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని జిల్లాస్థాయి ఆస్పత్రిలో కరోనా పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆస్పత్రిలో మంగళవారం 34 మందికి పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు తెలిపారు.

30 మందికి వ్యాక్సిన్

కొండాపూర్‌లోని జిల్లా స్థాయి ఆస్పత్రిలో కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియలో భాగంగా మంగళవారం మొత్తం 30 మందికి టీకాలు వేశారు. అందులో మొదటి డోస్ 8 మందికి, రెండవ డోస్ తొమ్మిది మందికి, బూస్టర్ డోస్ 13 మందికి వేసినట్లు డాక్టర్లు తెలిపారు.

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ముగ్గురికి కరోనా పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



మహేష్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఎల్లమ్మబండకు చెందిన మహేష్‌కు రూ.80 వేల రూపాయల చెక్కును మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్కతో నిండిన గంగారం చెరువు

మురుగు, వ్యర్థ జలాలు..

గుర్రపుడెక్కతో నిండిపోతున్న చెరువులు

పరిసరాల్లో చెత్తచెదారం

ఇలా అన్నీ చెరువుల్లోకే..



మియాపూర్ పటేల్ చెరువు

మియాపూర్: చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. డ్రైనేజీ, మురుగు, వ్యర్థ జలాలు ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. ఓ వైపు గుర్రపుడెక్క, మరోవైపు చెరువు పరిసరాల్లో వ్యర్థాల పారబోతతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. పలు కాలనీల్లో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. చెరువులు, నాలా పరీవాహక ప్రాంతాలవాసులకు దోమలతో కంటి మీద కునుకులేకుండా పోతోంది. మియాపూర్, చందానగర్ డివిజన్ల పరిధిలో గంగారం చెరువు, భక్షికుంట చెరువు, గురున్నాథం చెరువు, పటేల్ చెరువు, బచ్చుకుంట, రామసముద్రం చెరువు, న్యూ కాలనీ చెరువు, మక్తమహబూబ్‌పేట్ చెరువు, రేగుల కుంట చెరువులు కలుషితమయ్యాయి. ఏటా చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. మియాపూర్ డివిజన్‌లో పటేల్ చెరువు, చందానగర్‌లోని గంగారం చెరువు సుందరీకరణ పనులు గత నాలుగేళ్ల క్రితం చేపట్టారు. రెండేళ్ల నుంచి పనులు సాగడం లేదు. చుట్టు పక్కల కాలనీల నుండి మురుగు నీరంతా చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్త్రీవిద్యకు కృషిచేసిన మహనీయురాలు సావిత్రీబాయి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: స్త్రీ విద్య కోసం నిరంతరం కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ గ్రామ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో సావిత్రీబాయి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మురళీ, వెంకటేశ్, రాజుకుమార్, శ్రీను, విష్ణు, అనిల్, వెంకటేశ్, మహ్మద్, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో..

స్త్రీ విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధి బచ్చుగూడెంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేశ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు గడ్డ పుణ్యవతి, మండల ప్రధాన కార్యదర్శి కావళి విరేశం, బీజేపీ నాయకుడు అల్లం రాజిరెడ్డి, ఎస్ఆర్‌కె యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మియాపూర్ నడిగడ్డతండాలో..

మియాపూర్: మియాపూర్ నడిగడ్డతండాలో నడిగడ్డతండా కమిటీ ఆధ్వర్యంలో సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా స్టాలిన్‌నగర్‌లోని అంగన్‌వాడీలో సావిత్రి చిత్రపటానికి జాతీయ చేనేత ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి లావణ్య తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, శ్వేత, వీరమణి, గౌసియాబేగం, ఖైరున్నీసాబేగం, వీనా,శాంతబాయి,అరుణ, సిక్కుబాయి, ముఖేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



స్టాలిన్‌నగర్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్

లింక్ క్లిక్ చేసి పలు దఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ పేరుతో ఒకరికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తన వివరాలు నమోదు చేసి..నగదు పంపాడు. ఇలా 3,49,073 రూపాయలు సైబర్ నేరగాడికి పంపి మోసపోయాడు. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన నరేష్ ప్రైవేట్ ఉద్యోగి. గత ఏడాది నవంబర్ 21వ తేదీన నరేష్‌కు జాబ్ ఆఫర్ పేరిట వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. లింక్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేశాడు. ముందుగా రూ.1000 చెల్లించాడు. ఈ మొత్తానికి కమీషన్ ఇచ్చారు. పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తే రెట్టింపు డబ్బుతోపాటు కమీషన్ ఇస్తామని సైబర్ నేరగాడు నమ్మబలికాడు. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్ చేయగా, రూ.6,44,398 వస్తుందని నమ్మించారు. అయితే డబ్బు తన ఖాతాలో జమ చేయాలంటూ ఫోన్ చేయగా, నరేష్ నంబరు బ్లాక్‌లో పెట్టారు. దీంతో తన మోసపోయినట్టు గుర్తించి మొదటగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు ఠాణాలో కూడా ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ఐఎస్‌బీ'లో పబ్లిక్ పాలసీ డైలాగ్స్-2023

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (బిఐపీపీ) ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీ డైలాగ్స్-2023' మొదటి ఎడిషన్‌ను బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించేందుకు ఐఎస్‌బీ ఏర్పాట్లు చేసింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభ కార్యక్రమం ఖేమ్కా ఆడిటోరియంలో లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కటికతల శ్రీనివాస్, ప్రధాని మాజీ సలహాదారు అమర్‌జీత్‌సిన్హా, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రెటరీ జుగల్ కిషోర్ మోహపాత్ర, టైమ్స్ నెట్‌వర్క్ గ్రూప్ ఎడిటర్ నవికాకుమార్, ఐఎస్‌బీలోని బిఐపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్వినిచాత్రే తదితరులు పాల్గొంటారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

పటాన్‌చెరుటౌన్: టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ అధికారి (సీడీపీఓ, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్ ఆఫ్ వేర్ హౌస్) పోస్టులకు నియామక పరీక్షలు మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో జరిగాయి. పరీక్షరాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. రెండు సెషన్స్‌లో ఎగ్జామ్ జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష సాగింది. ఉదయం 210 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 132 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండో సెషన్‌లో సాగిన పరీక్షలో 210 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 134 మంది పరీక్షకు హాజరయ్యారు.

ముగ్గుల పోటీలు

మియాపూర్: చందానగర్‌లోని భిక్షపతి ఎన్‌క్లేవ్ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొమిరిశెట్టి ఫౌండేషన్, విజేత సూపర్ మార్కెట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. కాలనీ మహిళలు,యువతులు ఉత్సాహంగా రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



భిక్షపతి ఎన్‌క్లేవ్ కాలనీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

క్రీడాకారిణికి సన్మానం



మియాపూర్: క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత జాతీయ అథ్లెటిక్ శిక్షకుడు నాగపూరి రమేష్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా హాకీ క్రీడాకారిణి జ్యోతిరెడ్డి క్రీడల కోటాలో రైల్వే ఉద్యోగం సాధించిన సందర్భంగా మంగళవారం చందానగర్‌లో తెలంగాణ హాకీ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారిణికి సన్మానం చేశారు. కార్యక్రమంలో హాకీ తెలంగాణ ట్రెజరర్ భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, త్రివేణి స్కూల్ డైరెక్టర్ సుబ్బారావు, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదచారిని ఢీ కొట్టిన వాహనం

ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు వైద్యుల వెల్లడి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న పాదచారిని బొలెరో ట్రాలీ వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మార్గ మధ్యంలోనే మృతిచెందినట్టు వెల్లడించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం...వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన దత్తయ్య(44) బతుకుదెరువు కోసం పటాన్‌చెరులోని భగత్‌గల్లీలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు దత్తయ్య డ్యూటీకి వెళ్తుండగా నవపాన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలెరో ఢీకొట్టింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 23 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ఆరుగురికి రూ.3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కంటి వెలుగును విజయవంతం చేద్దాం

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పటాన్‌చెరు నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి వెలుగు 2 కార్యక్రమం ద్వారా చేపట్టబోతున్న వివరాలను మంత్రి హరీశ్‌రావు వివరించారు. తొలి విడత కంటి వెలుగు కార్యక్రమం పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రెండో విడత విజయవంతం చేస్తామన్నారు. సమీక్షలో పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం పాల్గొన్నారు.



విద్యతో పాటు క్రీడలు అవసరం

- ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్
- ఘనంగా త్రివేణి పాఠశాల వార్షిక క్రీడా సంబరాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

హఫీజ్‌పేట్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ త్రివేణి పాఠశాలలో వార్షిక క్రీడా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, రంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారన్నారు. త్రివేణి పాఠశాలలో క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని, విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీసీ డాక్టర్ నటరాజ్, సీఆర్‌ఓ సాయి నరసింహారావు, సెంట్రల్ ఐఐటీ కోఆర్డినేటర్ చక్రి, సీఎస్ఓ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ హిమబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్, రంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తొలి మెట్టు కార్యక్రమంలో మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్ఎం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. మండల విద్యాధికారి జెమినీకుమారి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పటాన్‌చెరు టౌన్: ముంబైకి చెందిన రంగోత్సవం సెలబ్రేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన పలు ఆర్ట్స్ పోటీల్లో పటాన్‌చెరులోని విద్యా భారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలను సాధించారు. ఇటీవల నిర్వహించిన రంగోత్సవం కార్యక్రమంలో వివిధ రంగాల్లో 171 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 24 మంది విద్యార్థులకు బహుమతులు లభించాయి. వీటితో పాటుగా డ్రాయింగ్ టీచర్ పావనికి కళా భూషణ్ అవార్డు, ప్రధానోపాధ్యాయుడు శ్రీజ నాయర్‌కు కృషి షీల్డ్ లభించింది. ఈ బహుమతులను పాఠశాల ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఈవెంట్ డైరెక్టర్ గుండు శివకుమార్, ప్రిన్సిపాల్ శ్రీజ నాయర్ విద్యార్థులకు అందజేశారు.

ఆస్పత్రి సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కాయకల్ప బృందం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం కాయకల్ప బృందం సభ్యులు ఆకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల నిర్వహణ సక్రమంగా ఉందని కాయకల్ప బృందం నిర్వాహకుడు, భైంసా సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు ఎక్కువగానే వస్తున్నారని పరిశీలనలో తెలుసుకున్నామన్నారు. మంచి మార్కులు వస్తే ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తారన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసేలా ఈ పరిశీలన ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రేవంత్, ఆర్ఎంఓ ప్రవీణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఢిల్లీలోని ఎర్రకోటపై గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్ పుష్పనగేశ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించుకొని రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. దేశాన్ని పరిపాలించే సత్తా కేసీఆర్‌కు ఉందని, దేశ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక మంది మేధావులు, వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. వారు పాలిస్తున్న రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సదుపాయాలు కూడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య యాదవ్, బూరుగడ్డ నగేశ్, సామిల్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కారు అదుపుతప్పిన ఘటనలో ఒకరి మృతి



ప్రమాదానికి గురైన కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటకు చెందిన ఎండీ సాజిత్(28) డ్రైవర్. కాగా మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అతని స్నేహితులు సుల్తాన్, ఇంతియాజ్‌తో కలిసి లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌కు టిఫిన్ చేయడానికి కారులో బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డివైడర్‌ను ఢీ కొట్టారు. అదే వేగంతో ఎడమవైపు ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాజిత్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.